## క్లుప్తంగా

### 400 మందికి వైద్య పరీక్షలు



అచ్చంపేట: స్థానిక జెడ్పీ గెస్ట్ హౌస్ వద్ద కాటూరి హాస్పిటల్స్ వైద్యులు నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో 400 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఎంపీపీ భూక్యా స్వర్ణమ్మభాయి, రమేష్ నాయక్ దంపతులు ప్రారంభించారు. శిబిరంలో జనరల్ వైద్యసేవలతో పాటు కార్డియాలజీ, ఆర్థోపెడిక్, ఈఎన్టీ, అప్తమాలజీ, డెర్మటాలజీ, పల్మనాలజీ తదితర విభాగాలలో వైద్యులు పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఆపరేషన్లు అవసరమైన వారిని ఎంపికచేసి గుంటూరులో కాటూరి హాస్పిటల్‌లో శస్త్రచికిత్స చేయనున్నట్లు వైద్యులు తెలిపారు. వివిధ గ్రామాల నుంచి భారీ సంఖ్యలో రోగులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోయ శ్రీనివాసరావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా లక్ష్మీనారాయణ



అమరావతి: వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శిగా, మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా సేవలు అందించి వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ వింగ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన అలా లక్ష్మీనారాయణను పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అభినందించారు. పార్టీ పంచాయతీ రాజ్ వింగ్ జిల్లా అధ్యక్షుడిగా తనను నియమించిన మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శంకరరావులకు ఈ సందర్భంగా అలా లక్ష్మీనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అలా లక్ష్మీనారాయణను మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, ఎండ్రాయి సర్పంచ్ నాయుడు రాంబాబు, నాయకులు వెంపా వాసు, నాయుడు సాంబశివరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందించారు,.

### మద్యం వ్యాపారులు సమయపాలన పాటించాలి

ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ టి.తులసి



క్రోసూరు: క్రోసూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలోని అన్ని లైసెన్సు మద్యం దుకాణాల నిర్వాహకులు సమయపాలన పాటించాలని, మద్యాన్ని ఎమ్మార్పీకే విక్రయించాలని ఆ శాఖ సీఐ టి.తులసి కోరారు. శుక్రవారం మూడు మండలాల్లోని లైసెన్సు మద్యం దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణాల్లో స్టాక్ రిజిస్టర్, స్టాక్ నిల్వ, రికార్డులు పరిశీలించారు. మద్యం ధరలు గురించి దుకాణానికి వచ్చే కస్టమర్లను అడిగి తెలుసుకున్నారు. ఎమ్మార్పీ ధరల పట్టికలు పెట్టారో లేదో, దుకాణాల వద్ద సిట్టింగులు ఏమైనా ఉన్నాయా పరిశీలించారు. ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రస్తున్నట్లు సమాచారం ఉంటే లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. అదేవిధంగా ప్రభుత్వం నిర్దేశించిన సమయానికి షాపులు తెరవాలని, రాత్రి 10 గంటల తరువాత షాపులు ఉండకూడదని హెచ్చరించారు. తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్ఐ, సిబ్బంది పాల్గొన్నారు.

### కాలిన గాయాలతో వృద్ధురాలు మృతి



నకరికల్లు: పొగాకు కాల్చుకునే క్రమంలో అగ్గిపుల్ల చీరకు అంటుకొన్న మంటలకు తీవ్రగాయాలపాలైన వృద్ధురాలు చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ ఘటన మండలంలోని చల్లగుండ్ల గ్రామంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చల్లగుండ్ల గ్రామానికి చెందిన కంభంపాటి కోటేశ్వరమ్మ(76) గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమైంది. కుటుంబ సభ్యులకు తెలియకుండా చాటుమాటుగా చుట్ట కాల్చేది. ఈ క్రమంలో గురువారం చుట్ట కాల్చుకునేందుకు అగ్గిపుల్ల ముట్టించగా అది చీరకు అంటుకొని మంటలు చెలరేగి తీవ్ర గాయాలపాలైంది. అది గమనించిన కుటుంబ సభ్యులు మంటలను ఆర్పి చికిత్స కొరకు నరసరావుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందింది. ఘటనపై మృతురాలి కుమారుడు వెంకట్రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

### 8 మంది జూదరుల అరెస్ట్

అమరావతి: మండల పరిధిలోని ఎండ్రాయి గ్రామంలో శుక్రవారం అమరావతి పోలీసులు దాడి చేసి 8 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నారు. శుక్రవారం మధ్యాహ్నం పోలీసులకు అందిన సమాచారం మేరకు ఎండ్రాయిలో జూదమాడుతున్న 8 మందినీ, వారి వద్దనున్న రూ.4,200 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేశారు.

# జ్యోతిరావు పూలే మార్గం ఆదర్శనీయం

**వాడవాడలా పూలే జయంతి వేడుకలు**

సత్తెనపల్లి: అసమానతలు లేని సమాజాన్ని నిర్మించడంలో జీవితాన్ని త్యాగం చేసిన గొప్ప సంఘ సంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే అని వైఎస్సార్‌సీపీ సత్తెనపల్లి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవ్ రెడ్డి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో, తాలూకా సెంటర్‌లో శుక్రవారం నిర్వహించిన జ్యోతిరావు పూలే జయంతి వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తాలూకా సెంటర్‌కు చేరుకొని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, పెండెం బాబురావు, షేక్ మౌలాలి, తుమ్మల వెంకటేశ్వరరావు, అచ్యుత శివప్రసాద్, బండి మల్లికార్జున్ రెడ్డి, లోకా మాధవ, షేక్ గోర, వాకుమళ్ల చెంచిరెడ్డి, షేక్ జలీల్, కొణతం స్వాతి, విప్పర్ల ఏడుకొండలు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

పట్టణ తాలూకా సెంటర్‌లోని పూలే విగ్రహం వద్ద శుక్రవారం టీడీపీ ఆధ్వర్యంలో పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటు పడిన దీన జన బాంధవుడు మహాత్మా జ్యోతిరావు పూలే అని అన్నారు. ముందుగా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, సర్వేపల్లి సీతారామాంజనేయులు, చామర్తి ఆంజనేయులు, జనసేన నాయకుడు తవిటి భావనారాయణ, తదితరులు ఉన్నారు. అలాగే తాలూకా న్యాయస్థాన ప్రాంగణంలోని న్యాయవాద గుమస్తాల హాలులో పూలే జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



సత్తెనపల్లి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సుధీర్‌భార్గవ్ రెడ్డి, నాయకులు

- బీసీ సంఘ నాయకుడు యర్రగొర్ల శ్రీనివాస్ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పట్టణ తాలూకా సెంటర్‌లోని పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.
- పూలే అంటరానితనం, కుల వ్యవస్థ, సాంఘిక దురాచారాలకు వ్యతిరేకంగా పోరాటం చేశారని సీనియర్ న్యాయవాది బత్తిన శ్రీనివాస్‌బాబు అన్నారు. పట్టణ తాలూకా సెంటర్‌లో పూలే జయంతి వేడుకలు గుర్రం జాషువా సాహితీ సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సంస్థ ఉపాధ్యక్షుడు ఏఎన్నార్ జక్కం పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి సురేష్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.
- పట్టణ వెంకటపతి నగర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని, సామాజిక స్పృహ కలిగి ఉండాలని, పూలే వంటి మహనీయులను స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో ఎదగాలన్నారు. వసతి గృహ సంక్షేమ అధికారిణి పాలెపోవు సుమణి, న్యాయవాది పూజల వెంకట కోటయ్య, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హైకోర్టు న్యాయవాది దేవకుమార్

- మహాజన దళిత సమితి, వడ్డెర షార్ప్ థింకింగ్ అసోసియేషన్, సత్తెన్న వడ్డెర సంక్షేమ సేవా సంఘం, మాదిగ ఉద్యోగుల సమాఖ్య, రెవ డాక్టర్ విలియం కేరి మెమోరియల్ స్వచ్ఛంద సేవా సంస్థ తదితర సంస్థల ఆధ్వర్యంలో పూలే జయంచి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయా సంస్థల అధ్యక్షులు, సభ్యులు పాల్గొని పూలేకు నివాళులర్పించారు.

### సామాజిక న్యాయానికి నాంది పలికిన పూలే

పెదకూరపాడు: దేశంలో సామాజిక న్యాయానికి నాంది పలికన వారిలో ముందుండే వ్యక్తి మహాత్మ పూలే అని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. గుంటూరులోని ఎమ్మెల్యే ప్రవీణ్ కార్యాలయంలో శుక్రవారం పూలే జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే ప్రవీణ్ మాట్లాడుతూ మహిళలకు, వెనుకబడిన వర్గాలకు విద్య అందించడానికి పూలే కృషి మరువలేమన్నారు.



పూలే చిత్రపటానికి పూల మాల వేస్తున్న ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్

**నకరికల్లులో...**

నకరికల్లు: నూరు శాతం అక్షరాస్యత సాధించినపుడే పూలే ఆశయం సిద్ధిస్తుందని పీడీఎం జిల్లా అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి అన్నారు. స్థానిక అబ్దుల్ కలాం సెంటర్‌లో పూలే జయంతిని శుక్రవారం నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు పూలే వేసిన పునాదితో అన్ని వర్గాల్లో విద్యాజ్యోతులు వెలుగుతున్నాయని అన్నారు. కార్యక్రమంలో మీరయ్య, రాధాకృష్ణ, అంకమ్మరావు, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

**అమరావతిలో...**

అమరావతి: కులవ్యవస్థ నిర్మూలనకు, వెనుకబడిన కులాల అభ్యున్నతికి పాటుపడిన మహనీయుడు పూలే అని సీపీఎం మండల కార్యదర్శి బి.సూరిబాబు అన్నారు. శుక్రవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో మండల కేవీపీఎస్ ఆధ్వర్యంలో పూలే జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూరిబాబు మాట్లాడారు. తొలుత జ్యోతీరావ్‌పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టి.కృష్ణ, ఎస్కే నాగులు, సుబ్రమణ్యం, మొహిద్దీన్ వలి, మురారి, తోకల సూరిబాబు, దారా ప్రసాద్, ప్రదీప్ పాల్గొన్నారు.

**అచ్చంపేటలో...**

అచ్చంపేట: అణగారిన కులాల ఆశాజ్యోతి మహాత్మా పూలే అని హైకోర్టు న్యాయవాది సరికేటి దేవకుమార్ అన్నారు. స్థానిక లీఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయంలో అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన పూలే జయంతి వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా పలువురు నాయకులు జ్యోతిరావు పూలే, సావిత్రీబాయ్‌పూలే చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేవకుమార్, అంబేడ్కర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చిల్కా చంద్రయ్య మాట్లాడారు. కార్యక్రమంలో లీఫ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి శిఖా నరసింహారావు, శిఖా రాజారావు, సలికేటి సింహారాయలు పాల్గొన్నారు.



తాలూకా సెంటర్‌లో పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, నాయకులు



సత్తెనపల్లి బాలికల వసతి గృహంలో మాట్లాడుతున్న కమిషనర్ ఆనంద్‌కుమార్



అమరావతి సీపీఎం కార్యాలయంలో...



పూలే విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

## జాతీయ అవార్డుకు ఎంపికైన శ్రీనివాసరెడ్డి



పెదకూరపాడు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ప్రతిభా పురస్కారానికి పల్నాడు జిల్లా 75త్యాళ్ళూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ అన్నపురెడ్డి శ్రీనివాసరెడ్డి ఎంపికయ్యారు. తెలంగాణ పుడమి సాహితీ వేదిక ఎంపిక చేసినట్లు శ్రీనివాసరెడ్డి శుక్రవారం తెలిపారు. జాతీయ స్థాయిలో విద్యా వైద్యం, సాహిత్యం, సాంస్కృతిక, సామాజిక, క్రీడలలో విశేష సేవలు అందించిన వారికి ఈ పురస్కారం అందిస్తారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా, వ్యాసకర్తగా, సామాజిక రంగంలో చేస్తున్న కృషికి ఈ అవార్డు అందించనున్నారు. ఈ నెల 13న నల్గొండలో అవార్డు అందించనున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డిని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం గుంటూరు, పల్నాడు జిల్లాల అధ్యక్షులు ఎ.తిరుమలేష్, ఆర్.శ్రీనివాసరెడ్డి, ప్రముఖ విద్యావేత్త బి.శివరామయ్య, పల్నాడు జిల్లా ఫ్యాప్టో కో చైర్మన్ టి.చంద్రయ్య, ఎస్ఎంసీ చైర్మన్ పున్నారావు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయులు అభినందించారు.

## జాతీయ అవార్డుకు ఎంపికైన ఉపాధ్యాయులు



వెళంగణి జ్యోతి / సీతామహాలక్ష్మి / కూచిపూడి సరిత / షేక్ బాజి / రెబ్బవరపు శిరీష

పెదకూరపాడు: పెదకూరపాడు మండలంలోని పలు పాఠశాలల ఉపాధ్యాయులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జాతీయ ప్రతిభా అవార్డుకు ఎంపికైనట్లు సదరన్ ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పి.నాగయ్య శుక్రవారం తెలిపారు. మండలంలోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీషు మీడియం పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ వెళంగణి జ్యోతి, తెలుగు, సోషల్ ఉపాధ్యాయులు సీతామహాలక్ష్మి, కూచిపూడి సరిత, కాకతీయ పబ్లిక్ స్కూల్ హిందీ ఉపాధ్యాయుడు షేక్ బాజి, మండపాడు శ్రీనివాస హైస్కూల్ సోషల్ ఉపాధ్యాయురాలు రెబ్బవరపు శిరీషలు ఎంపికయ్యారు. వీరికి ఈ నెల 13న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో జరిగే కార్యక్రమంలో అవార్డులు అందించనున్నారు. విద్యాభివృద్ధికి, సామాజిక సేవలకు గాను వారు ఈ అవార్డు అందుకోనున్నారు.

## రైతన్నలకు అండగా నిలిచేందుకు రైతు సంఘం ఆవిర్భావం

నకరికల్లు: రైతులకు అండగా నిలుస్తూ వారి సమస్యల పరిష్కారానికి రైతు సంఘం ఆవిర్భవించిందని రైతు సంఘం మండల బాధ్యుడు ఈవూరి అప్పిరెడ్డి అన్నారు. మండలంలోని చేజర్ల గ్రామంలో రైతు సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎర్రపతాకం ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్నోలో ప్రారంభమైన అఖిల భారత కిసాన్ సభ అవిశ్రాంతంగా రైతుల కోసం పోరాడుతూనే ఉందన్నారు. మోదీ తీసుకొచ్చిన నల్ల చట్టాలను వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులను ఏకం చేసి కేంద్రం ఉపసంహరించుకునేలా పోరాటం చేసిన ఘనత ఏఐకేఎస్‌దేనన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించి, సాగునీటిని సకాలంలో అందించేందుకు ప్రాజెక్టులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి జి.పిచ్చారావు, చట్టు కోటేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, బి.కొండానాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.



చేజర్లలో ఎర్రజెండా ఎగురవేస్తున్న రైతు సంఘం నాయకులు

## అఖిల భారత కిసాన్ సభ జెండా ఆవిష్కరణ

ముప్పాళ్ళ: అఖిల భారత కిసాన్ సభ ఆవిష్కరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కిసాన్ సభ జెండాను జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 1936 ఏప్రిల్ 11న లక్నోలో కిసాన్ సభ ఏర్పడి సమావేశం జరిగిందన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో రైతులను భాగస్వాములను చేయటం కోసం జమీందారీ విధానం పోవాలంటూ వివిధ రాష్ట్రాల్లో ఆందోళన చేస్తున్న రైతు సంఘాలన్నీ కలిసి అఖిల భారత కిసాన్ సభను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సంఘానికి మొట్టమొదటి అధ్యక్షుడిగా స్వామి దయానంద సరస్వతి, కార్యదర్శిగా ఎన్జీరంగా ఎన్నికయ్యారన్నారు. దేశ వ్యాప్తంగా అనేక పోరాటాలు చేసి కౌలు చట్టం, పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా స్వామినాథన్ కమిటీ సిఫార్సు మేరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రుణ విమోచన చట్టం తేవాలని పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరెడ్డి, పాలురాజు, తిరుపతి ఏడుకొండలు, కూరపాటి కోటయ్య, టి.అమరలింగేశ్వరరావు, బీ నరసింహారావు పాల్గొన్నారు.



## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ముప్పాళ్ళ: మండల విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని 11 కేవీ లైన్లు, ఉప కేంద్రంలోని పరికరాల మరమ్మతులలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ జీ సుచరిత శుక్రవారం తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

**12, 13 తేదీలలో విద్యుత్ సరఫరా నిలిపివేత**

అచ్చంపేట: మండలంలో విద్యుత్ అంతరాయాలను క్రమబద్ధీకరించేందుకు ఈ నెల 12, 13 తేదీలలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఏఈ శివకోటిరెడ్డి తెలిపారు. ముందుగా 11, 12 తేదీలలో మరమ్మతులు చేయాలనుకున్నామని, కానీ మండలంలో శుక్రవారం మెగా వైద్య శిబిరం నిర్వాహకుల కోరిక మేరకు ఒకరోజు వాయిదా వేయవలసి వచ్చిందని చెప్పారు. విద్యుత్ వినియోగదారులు, విద్యుత్ ఆధారిత సంస్థలు సహకరించవలసినదిగా ఆయన కోరారు.

రాజుపాలెం: విద్యుత్ మరమ్మతుల నిమిత్తం మండలంలోని అన్ని గ్రామాలలో నేడు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ ఏఈ కోట పెద మస్తాన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు, రైతులు గమనించి సహకరించాలని కోరారు.

సత్తెనపల్లి: పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పట్టణంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ టీబీ కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

పెదకూరపాడు : మండలంలోని పెదకూరపాడు, 75 త్యాళ్లూరు పరిధిలోని 20 గ్రామ పంచాయతీల లో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యా హ్నం 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రామకృష్ణ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

## సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు సహకరించాలి

**సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్**

నకరికల్లు: గ్రామాల్లో శాంతిభద్రతలు నెలకొల్పేందుకు ప్రజల సహకారం అవసరమని సత్తెనపల్లి రూరల్ సీఐ పి.కిరణ్ ప్రజలకు సూచించారు. మండలంలోని చీమలమర్రి గ్రామంలోని ప్రజలతో శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో వివాదాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుకు స్వచ్ఛందంగా సహకరించాలన్నారు. మహిళలను గౌరవించడం మగపిల్లలకు తల్లిదండ్రులు నేర్పించాలన్నారు. ప్రయాణ సమయంలో రోడ్డుపై అతివేగంగా వెళ్లవద్దని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ చల్లా సురేష్, సిబ్బంది పాల్గొన్నారు.



చీమలమర్రిలో ప్రజలతో మాట్లాడుతున్న సీఐ పి.కిరణ్ పక్కన ఎస్ఐ సురేష్

## విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో వైద్య శిబిరం

సత్తెనపల్లి: అన్ని అవయవాల కన్నా కళ్లు ప్రధానమైనవని, అలాంటి కళ్లను నిర్లక్ష్యం చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. అందరికీ నాణ్యమైన కంటి వైద్యం అందించాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం సత్తెనపల్లి ఆధ్వర్యంలో డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ కంటి ఆస్పత్రి సహకారంతో శుక్రవారం స్థానిక విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా ఈ శిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రిటైర్డ్ ఎంప్లాయిస్, వారి కుటుంబ సభ్యులు పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు ప్రసాద్, రామారావు, చంద్రయ్య, జోజిరెడ్డి, సైదులు, కమలాకర్‌రావు తదితరులు ఉన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## విద్యార్థులకు అంకితభావం అవసరం

అమరావతి: ఇంటర్మీడియట్ తర్వాత విద్యార్థులు లక్ష్యం మీద దృష్టి సారించి పట్టుదల, అంకిత భావంతో విద్యాభ్యాసం చేయాలని చలపతి విద్యాసంస్థల అధినేత వైవీ ఆంజనేయులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ధరణికోట వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు కళాశాల ధాన్యకటక జేఈఈ, నీట్ అకాడమీలో ఇంటర్ విద్యార్థుల వీడ్కోలు వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రిన్సిపాల్ పోకల శివప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వైవీ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని, సాకారం చేసుకోవటానికి నిరంతర కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యవర్గ సభ్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.



వీడ్కోలు వేడుకల సాంస్కృతిక కార్యక్రమాలలో విద్యార్థినులు

## శిశువులకు తల్లిపాలే శ్రీరామరక్ష



ముప్పాళ్ళ: తల్లి పాలల్లో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుందని, శిశువుకు తల్లిపాలే శ్రీరామరక్ష అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ చెప్పారు. మండల కేంద్రమైన ముప్పాళ్ళలోని బీసీ, ఎంటీ అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ అనంతలక్ష్మీ శిశువులో ఇన్‌ఫెక్షన్‌ను నివారించడానికి చేతులు కడుక్కోవడం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కౌమార దశలో ఉన్న వారికి, గర్భిణులకు రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లి పాల వలన కలిగే లాభాలను వివరించారు. అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఈ నెల 22వ తేదీ వరకు పౌష్టికాహార పక్షోత్సవాలు నిర్వహించటం జరుగుతుందన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో ఉర్దూ స్కూల్ టీచర్ లుషేక్ గౌసియాబేగం , షేక్ షహనాజ్, రమాదేవి, షేక్ ఉమేహాన్, అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### 21న ఆదర్శ పాఠశాల ఆరోతరగతి ప్రవేశ పరీక్ష

నకరికల్లు: ఈ నెల 21వ తేదీన ఆదర్శ పాఠశాలలో ఆరోతరగతిలో ప్రవేశానికి పరీక్ష నిర్వహించనున్నట్లు దేచవరం ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కె.వేళాంగిణి మేరీ శుక్రవారం తెలిపారు. 20 ఆదివారం ఈస్టర్ పండుగ పురస్కరించుకొని అదేరోజు నిర్వహించాల్సిన ప్రవేశ పరీక్ష 21వ తేదీ సోమవారానికి వాయిదా పడిందన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు పరీక్ష జరుగుతుందని అన్నారు. విద్యార్థులు తమ హాల్ టికెట్స్‌ను డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ ద్వారా గానీ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎంఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వైబ్‌సైట్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. దరఖాస్తు చేసుకున్న పాఠశాలలో పరీక్ష రాయాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు నిర్ణీత సమయానికి ముందుగానే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439 (సత్తెనపల్లి)
90100 01840 (పెదకూరపాడు)
Office mail : sakshigntadvt@gmail.com